RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక


www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :205 EDITOR: CHERUKU UPENDAR, DATE : SUNDAY 10 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 205 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 10 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## పారిశ్రామిక, ఐటీ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం

### మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

పారిశ్రామిక, ఐటీ రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతామని పరిశ్రమలు, ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో యూపీఏ ప్రభుత్వం

మిగతా 2లో

### తక్షణ కాల్పుల విరమణ కోసం ఐరాస పిలుపు వీటో పవర్‌తో

## అడ్డుకున్న అమెరికా



న్యూయార్క్ - ప్రభాత సూర్యుడు

ఇజ్రాయెల్ హమాస్ మధ్య భీకర పోరు వేళ .. తక్షణ కాల్పుల విరమణ కోసం ఐరాస భద్రతా మండలి పిలుపునిచ్చింది. ఈ దాడుల కారణంగా గాజాలోని సామాన్య ప్రజల బతుకు ఛిద్రమవుతున్నదని, గాజాలో తక్షణమే కాల్పులు విరమణ జరగాలని ఐరాస భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని అమెరికా వ్యతిరేకించింది. అందుకోసం తన వీటో పవర్‌ను ఉపయోగించింది. కాల్పుల విరమణ కోసం తీర్మానాన్ని ఆమోదించడానికి గతంలో చేసిన అనేక ప్రయత్నాలు వీటో చేయబడ్డాయి.

**ఐక్యరాజ్యసమితి వివరణ**

ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలోని విస్తారమైన

మిగతా 2లో

# మహాలక్ష్మి మహిళలకు వరం

- కిటకిటలాడిన బస్సులు, బస్టాండ్‌లు
- అట్టహాసంగా బస్సుల అలంకరణ
- ప్రభుత్వానికి మహిళల కృతజ్ఞతలు
- ఆర్టీస్ బస్సుల్లో ఫ్రీ జర్నీ ప్రారంభం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ పథకం ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహాలక్ష్మి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్‌స్టేషన్‌ల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి మొగ్గుచూపడంతో దాదాపు అన్ని బస్‌స్టేషన్‌లు మహిళలతో కిటకిటలాడాయి. హైదరాబాద్‌లోని ప్రధాన బస్‌స్టేషన్‌లో బాలికలు, మహిళలు ఆర్డీనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. శనివారం హాలీ డే ఉండడంతో కొంచెం రద్దీ తక్కువగా ఉందని అధికారులు తెలిపారు. సోమవారం

మిగతా 2లో

### స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్

## 14న ఏకగ్రీవ ఎన్నిక



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

శాసనసభ స్పీకర్ ఎన్నిక ఈ నెల 14న జరగనుంది. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఆధ్వర్యంలో ఆ ఎన్నిక జరగనుంది. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ నోటీఫికేషన్ ద్వారా సమయాన్ని నిర్ణయించాల్సి ఉన్నది. స్పీకర్ పదవికి ఇప్పటికే కాంగ్రెస్ పక్షం తరఫున మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పేరును ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉన్నది. స్పీకర్ ఎన్నిక తర్వాత కొలువుదీరిన ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. దానిపై

మిగతా 2లో

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పాలన


### సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ప్రజా పాలన ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. సోనియాగాంధీ జన్మ దినం తెలంగాణ ప్రజలకు ఓ పండుగ రోజనని ఆయన అన్నారు. డిసెంబర్ 9, 2009న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైందని గుర్తు చేశారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని ఉక్కు సంకల్పంతో సోనియమ్మ మన ఆకాంక్షలు నెరవేర్చారని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ 78 జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 78 కిలోల కేక్‌ను పీసీసీ మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు కేక్ కట్ చేశారు.

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా ప్రజలు సోనియమ్మకు కృతజ్ఞతలను వ్యక్తం చేశారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రజలు తనకు ఈ బాధ్యతను అప్పగించారని చెప్పారు. ఒక సేవకుడిగా ప్రజలందరి ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యతను తీసుకుంటాననీ, కార్యకర్తలకు కచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రే, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్

మిగతా 2లో






## కోలుకుంటున్న కేసీఆర్

- వాకర్ సాయం తో నడిపించిన డాక్టర్లు
- మరో రెండు మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేసే అవకాశం
- 6 నుంచి 8 వారాల రెస్ట్ అవసరం : డాక్టర్లు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : యశోద ఆసుపత్రిలో తుంటి ఎముక మార్పిడి శస్త్ర చికిత్స తరువాత మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. త్వరిత గతిన కోలుకోవడానికి అనుకూలంగా కేసీఆర్ శరీరం సహకరిస్తోందని, మానసికంగా కూడా వారు దృఢంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేసిన పేషెంట్ల ను వారి వారి శారీరక మానసిక సామర్థ్యాన్ని పరిశీలించి వారిని “మొబిలైజేషన్ స్టార్ట్” చేస్తారని డాక్టర్లు తెలిపారు. డాక్టర్ ప్రవీణ్ రావు మాట్లాడుతూ కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి లో ప్రోగ్రెస్ బాగుంది. చాలా వేగంగానే రికవరీ అవుతున్నారు. వాకర్ తో బెడ్ బయటకు వచ్చి కూర్చున్నారు. వాకర్ సాయంతో మేము రూమ్ లో నడిపించే ప్రయత్నం చేసినపుడు కెసిఆర్ శరీరం బాగా స్పందించింది. వారు రూమ్ లో వాకర్ సాయం తో నడిచారు. హిప్ రీప్లేసెమెంట్ జరుగగానే పేషెంట్ ను నడిపించే ప్రయత్నం చేస్తాం. వారు ఆపరేషన్ నొప్పి తగ్గి

మిగతా 2లో

# ఎమ్మెల్యేల ప్రమాణం

- తొలుత సీఎం రేవంత్, తర్వాత మంత్రులు
- కేసీఆర్, కేటీఆర్ సహా 18 మంది గైర్హాజరు
- సభకు రాని బీజేపీ సభ్యులు
- అసెంబ్లీ వాయిదా
- 14న తిరిగి ప్రారంభం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ మూడో అసెంబ్లీ శనివారం కొలువుదీరింది. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీ ఉదయం తొమ్మిది గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం 11.10 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శనివారం వంద మంది ఎమ్మెల్యేల చేత ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి, ఆ తర్వాత వరుసగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రమాణం చేశారు. అనంతరం మహిళా సభ్యులు ఆ తర్వాత మిగతా ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్ నుంచి 61 మంది, బీఆర్‌ఎస్ నుంచి 32 మంది, ఎంఐఎం నుంచి ఆరుగురు, సీపీఐ నుంచి ఒకరు ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీతో కలిపి మొత్తం 101 మంది ఎమ్మెల్యేలు మొదటిరోజు ప్రమాణస్వీకారం చేశారు. బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, చామకూర మల్లారెడ్డి, గంగుల కమలాకర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఐఎం సభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, జాఫర్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫీకర్ అలీ, మహమ్మద్ మాజిద్ హుస్సేన్, మహమ్మద్ మోబిన్, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. చివరిగా కాంగ్రెస్ సభ్యుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణం చేశారు. బీజేపీ సభ్యులు ఎనిమిది మంది సభకు హాజరు కాలేదు. అక్బరుద్దీన్ ఒవైసీ ప్రొటెం స్పీకర్‌గా ఉండడంతో ప్రమాణం చేయబోమని రాజాసింగ్ ప్రకటించిన విషయం తెలిసిందే. స్పీకర్ ఎన్నిక తర్వాత ప్రమాణస్వీకారం చేస్తామని

మిగతా 2లో

### స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్

## 14న ఏకగ్రీవ ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు చర్చిస్తారు.

అనంతరం బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశమై సభను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించనుంది. శనివారం శాసనసభలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణం ముగిసిన తర్వాత శాసనసభ ఈ నెల14కు వాయిదా పడింది.

## పారిశ్రామిక, ఐటీ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించిన ఐటీఐఆర్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తారని వెల్లడించారు. ఫార్మాసిటీ విషయంలో ప్రజలు ఆలోచనలు కూడా పరిగణనలోకి తీసుకుని ఓ నిర్ణయానికి వస్తామన్నారు. శాసన సభలో మంచి ఫలవంతమైన చర్చలు జరిగేలా చూస్తామని తెలిపారు.

## కోలుకుంటున్న కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

"మినిమల్ పెయిన్" తో కోలుకుంటున్నారు. బ్రీతింగ్ ఎక్సర్సైజ్ లు కూడా చేయిస్తున్నాం. మెడికల్ గా స్టేబుల్ గా ఉన్నారు. వారి బాడీ బాగా సహకరిస్తున్నది. మెంటల్లీ స్ట్రాంగ్ గా ఉన్నారు. నార్మల్ ఫుడ్ తీసుకుంటున్నారు. మరికొద్ది రోజుల పాటు ఫిజియో థెరఫీ కొనసాగించాల్సి వుంటుంది. ఇట్లానే శరీరం సహకరిస్తే మరో రెండు మూడు రోజుల్లో కేసీఆర్ డిశ్చార్జ్ చేస్తామని వెల్లడించారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పాలన

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కోదండరెడ్డి, జి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులకు శాఖలు కేటాయింపు

- భట్టికి ఆర్థికం, ఇంధనం..ఉత్తమ్‌కు భారీసాగునీటి పారుదల
- సీతక్కకు పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర మంత్రులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శాఖలు కేటాయించారు. ఇందుకోసం శుక్రవారం ఢిల్లీ వెళ్లిన సీఎం, ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు. శనివారం ఉత్తర్వులు జారీచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ఈ మేరకు జీవో నెంబరు 179 విడుదలైంది. సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు, హెూం, పురపాలక, విద్య, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమంతో పాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు సైతం ప్రస్తుతం సీఎం దగ్గరే ఉన్నాయి. రెండో విడత విస్తరణ అనంతరం వాటిని ఇతరులకు ఇవ్వనున్నారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని మంత్రిపదవులు దక్కని ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం సందర్భంగా అసెంబ్లీ లాబీల్లో అనుకోవడం వినిపించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ సైతం ఇచ్చింది. ప్రకటించిన శాఖల వివరాలిలా ఉన్నాయి.

**రేవంత్‌రెడ్డి**
**సాధారణ పరిపాలన శాంతిభద్రతలు, మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు**

**మల్లు భట్టి విక్రమార్క**
**ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ**

**ఎన్ ఉత్తవమ్ కుమార్ రెడ్డి**
**భారీ నీటిపారుదల, పౌరసరఫరాలు**

**దామోదర రాజనర్సింహ**
**వైద్య,ఆరోగ్యశాఖ,కుటుంబ సంక్షేమం, సైన్స్. టెక్నాలజీ**

**సీతక్క**
**పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ వెల్ఫేర్, తాగునీటి సరఫరా**

**శ్రీధర్‌బాబు**
**ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు**

**కొండా సురేఖ**
**అటవీ శాఖ, దేవాదాయ, పర్యావరణ**

**పొంగులేటి శ్రీనివాస్**
**రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలు**

**కోమటిరెడ్డి వెంకటరెడ్డి**
**రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ**

**జూపల్లి**
**ఎక్సైజ్, పర్యాటకం, పురావస్తు**

**తుమ్మల నాగేశ్వరరావు**
**వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, చేనేత**

**పొన్నం ప్రభాకర్**
**రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ**

# మహాలక్ష్మి.. మహిళలకు వరం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. టికెట్ల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఇది వారం రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. హైదరాబాద్ నగరంలోని 25 ఆర్టీసీ డిపోల నుంచి 2800 బస్సుల్లో ఏసీ బస్సులు మినహాయించి మిగతా అన్ని బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 589 బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో దాదాపు అన్ని బస్సుల్లో 70శాతం వరకు మహిళలే ప్రయాణం చేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ రోజు కేవలం సాంపిల్ టికెట్లు ఇచ్చినట్టు చెప్పారు. ఉచిత బస్ సర్వీసుల ప్రారంభం తమకు ఒక వరమని, ఇది తమకు చెప్పలేని ఆనందం అని పలువురు మహిళలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు కృతజ్ఞతలు చెప్పారు. ఫ్రీ జర్నీతో రద్దీ పెరుగుతుందని, అందుకనుగుణంగా బస్సులు పెంచి ఇబ్బందులు లేకుండా చూడాలని మహిళలు కోరుతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 7 డిపోల పరిధిలోని బస్టాండ్లు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి. పెద్దమొత్తంలో మహిళా ప్రయాణికులే శనివారం ప్రయాణం చేశారు. డిపో అధికారులు బస్టాండ్లలను అందంగా పూలు, మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో కలెక్టర్లు ప్రారంభించారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఎక్స్‌ప్రెస్‌లు 173, పల్లెవెలుగు 194, మొత్తం 367 బస్సులు రవాణా కొనసాగించాయి. ప్రతీ రోజు రీజియన్ పరిధిలో 1,17,000 మంది మహిళా, పురుష ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారని ఆర్‌ఎం తెలిపారు. మహిళా ప్రయాణికులు 47000 మంది ఉంటారని చెప్పారు. శనివారం మహిళా ప్రయాణికులకు టిక్కెట్ ఇవ్వలేదు కాబట్టి ఎంత మంది ప్రయాణికులు ప్రయాణించారన్నది వివరాలు తెలియదని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించగా.. నిర్మల్‌లో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావ్, మంచిర్యాలలో కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం మహిళా సాధికారతకు తొలి అడుగని సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. నల్లగొండలో జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, భువనగిరిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాలను కలెక్టర్ హనుమంతు జెండగే ప్రారంభించారు.

### తక్షణ కాల్పుల విరమణ కోసం ఐరాస పిలుపు వీటో పవర్‌తో

# అడ్డుకున్న అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలు బంజరు భూమిగా మారాయి. వ్యాధి ముప్పుతోపాటు ఆహారం, ఇంధనం, నీరు, ఔషధాల కొరతను ఎదుర్కొంటున్న 80 శాతం జనాభా స్థానభ్రంశం చెందారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. 'అంతర్జాతీయ మానవతా చట్టం పౌరులను రక్షించే బాధ్యతను కలిగి ఉంటుంది' అని గుటెర్రెస్ చెప్పారు. వీటో అధికారంతో తీర్మానాన్ని అడ్డుకున్న అమెరికా గాజాలో మానవతా సంక్షోభ నివారణ నిమిత్తం ఇటీవల ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ అసాధారణ అధికారాన్ని ఉపయోగించారు. యూఎన్ ఛార్టర్‌లోని ఆర్టికల్ 99ను ప్రయోగించారు. ఈ ప్రత్యేక అధికారంతో అంతర్జాతీయంగా ఆందోళనలను కలిగించే పరిస్థితుల్లో భద్రతా మండలిని సమావేశపరచవచ్చు. దీనిలో భాగంగా సమావేశమైన మండలిలో ఓటింగ్ జరిగింది. అయితే మండలిలో శాశ్వత సభ్యదేశమైన అమెరికా తన వీటో అధికారంతో తీర్మానాన్ని అడ్డుకుంది. మండలిలో మొత్తం 15 సభ్య దేశాలు ఉన్నాయి.

**అమెరికా, ఇజ్రాయెల్ వ్యతిరేకత**

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కాల్పుల విరమణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అది హమాస్ పుంజుకునేందుకు ఉపయోగపడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే గాజాలో పౌరుల రక్షణ కోసం, బందీల విడుదల కోసం యుద్ధంలో స్వల్ప విరామాలకు మాత్రం అమెరికా అనుకూలంగా ఉంది.

**అమెరికన్ రాయబారి రాబర్ట్ వుడ్ స్పందన**

అమెరికన్ రాయబారి రాబర్ట్ వుడ్ మాట్లాడుతూ.. తీర్మానం వాస్తవికతకు దూరంగా ఉందన్నారు. "నేల మీద సూదిని ముందుకు కదిలించలేరు" అని చెప్పారు. ఈ తీర్మానం ఇప్పటికీ షరతులు లేని కాల్పుల విరమణ కోసం పిలుపునిస్తుందని చెప్పారు. ఇది అక్టోబర్ 7న హమాస్ చేసిన పనిని పునరావతం చేయగలదు అని అభిప్రాయపడ్డారు.

**పాలస్తీనా ప్రతినిధి స్పందన**

"మీరు దానిని (యుద్ధాన్ని) సమర్థిస్తే, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలకు మద్దతు ఇస్తున్నారు" అని పాలస్తీనా ప్రతినిధి రియాద్ మన్సూర్ అన్నారు.

ఓటింగ్‌కు బ్రిటన్ దూరం..

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ కోసం భద్రతా మండలిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రతిపాదించిన ముసాయిదాకు 13 మంది అనుకూలంగా ఓటేశారు. బ్రిటన్ ఓటింగ్‌కు దూరంగా ఉంది. హమాస్ చర్యల పట్ల ఎలాంటి ఖండన లేకపోవడంతో ఓటింగ్‌కు దూరమయ్యామని బ్రిటన్ తెలిపింది.

# ఎమ్మెల్యేల ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రకటించారు.

**ప్రమాణం చేయని 18 మంది ఎమ్మెల్యేలు**

మొదటి రోజు అసెంబ్లీ సమావేశాల్లో 18 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయలేదు. 119 మంది ఎమ్మెల్యేలకు గానూ వంద మంది ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్‌తో కలిపి ఈ సంఖ్య 101. మరో 18 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయలేదు. వారిలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ నేత కె చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రులు కెటి రామారావు, కడియం శ్రీహరి, టి పద్మారావు, తోపాటు మహేశ్వర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకట రమణారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, పైడి రాకేశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్, రామారావు పవార్, రాజాసింగ్ ఉన్నారు.

**ఆంగ్లంలో ప్రమాణం చేసింది వీరే**

మొదటి అసెంబ్లీ సమావేశాల్లో 17 మంది ఎమ్మెల్యేలు ఆంగ్లంలో ప్రమాణస్వీకారం చేశారు. ఆంగ్లభాషలో ప్రమాణం చేసిన వారిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు లాస్య నందిత, ఎన్ పద్మావతి రెడ్డి, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, బండారి లక్ష్మారెడ్డి, గడ్డం వినోద్, మధుసూదన్ రెడ్డి, కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, ప్రేమ్‌సాగర్ రావు, లక్ష్మీకాంతరావు, మదన్‌మోహన్ రావు, మురా గోపాల్, మైనంపల్లి రోహిత్, తెల్లం వెంకట్రావ్, గడ్డం వివేక్ ఇంగ్లీష్‌లో ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. ఎంఐఎం నుంచి గెలుపొందిన జాఫర్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, జుల్ఫికర్ అలీ, మహమ్మద్ మాజీద్ హుస్సేన్, మహమ్మద్ మోబిన్ ఉర్దూలో ప్రమాణం స్వీకారం చేశారు. మిగిలిన 80 మంది సభ్యులు తెలుగులోనే ప్రమాణం చేశారు. పవిత్ర హృదయంతో ప్రమాణం చేసిన వారు సీతక్క, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అరెకపూడి గాంధీ, చిక్కుడు వంశీకృష్ణ, దొంతి మాధవరెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, కె శంకరయ్య, కసిరెడ్డి నారాయణరెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కూనంనేని సాంబశివరావు, మాగంటి గోపీనాథ్, వేముల వీరేశం పవిత్ర హృదయంతో ప్రమాణం చేశారు. మిగిలిన సభ్యులంతా దైవసాక్షిగా ప్రమాణస్వీకారం చేశారు.

**విపక్ష సభ్యులను పలకరించిన రేవంత్**

అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విపక్ష సభ్యుల వద్దకు వెళ్లి పలకరించారు. మాజీ మంత్రులు టి హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పి సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి,తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తోపాటు ఎంఐఎం సభ్యులను మర్యాదపూర్వ కంగా కలిసి కరచాలనం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ఇతర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు.

**14కు అసెంబ్లీ వాయిదా**

అసెంబ్లీ సమావేశాలు ఈనెల 14వ తేదీకి వాయిదా పడ్డాయి. మొదటి రోజు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం సభను వచ్చే గురువారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రకటించారు.

**ప్రమాణస్వీకారాన్ని బహిష్కరించిన బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట నిరసనకు యత్నం..అడ్డుకున్న పోలీసులు**

**-అమరవీరుల స్థూపానికి, అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యేల నివాళి**

అసెంబ్లీలో శనివారం నిర్వహించిన శాసనసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బీజేపీ ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా బహిష్కరించారు. నూతనంగా ఎన్నికైన ఆ పార్టీ ఎమ్మెల్యేలు తొలుత బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయనతో కలిసి చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలంతా కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి గన్‌పార్కుకు చేరుకున్నారు. అమరవీరుల స్థూపానికి ఏడుగురు ఎమ్మెల్యేలు (రాజాసింగ్ రాలేదు) నివాళులు అర్పించారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను నియమించడాన్ని నిరసిస్తూ అసెంబ్లీ గేట్-2 వద్ద వారు నిరసనకు దిగారు. ఐదుగురు సీనియర్ ఎమ్మెల్యేలుండగా అక్బరుద్దీన్‌కు ఎలా అవకాశమిస్తారంటూ నినదించారు. పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడ నుంచి బీజేపీ కార్యాలయానికి తరలించారు. ఆ తర్వాత ఇదే విషయంపై ఫిర్యాదు చేసేందుకు బీజేపీ ఎమ్మెల్యేలంతా రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అందుబాటులో లేరు. దీంతో ఆమె కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. సభలో చాలామంది సీనియర్లు ఉన్నప్పటికీ అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడాన్ని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

**కిషన్‌రెడ్డితో భేటీ**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నాడు నూతనంగా ఎన్నికైన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు రాజాసింగ్, పి.హరీశ్‌బాబు, పాయల్ శంకర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పవార్, పాడి రాకేశ్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాలతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాలు, ప్రమాణ స్వీకారం, ప్రొటెం స్పీకర్‌గా ఓవైసీ ఎంపిక అంశంపై వారు చర్చించారు. ప్రొటెం స్పీకర్ ఎవరున్నా సభకు హాజరుకావడమే సరైనదని కొందరు ఎమ్మెల్యేలు వాదించినట్టు తెలిసింది. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ నియమితులైన దృష్ట్యా తమ ఎమ్మెల్యేలంతా అసెంబ్లీలో శాసనసభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరుకాబోరని రాజాసింగ్ ప్రకటన చేసిన తర్వాత హాజరైతే బాగుండబోదని కిషన్‌రెడ్డి వారించినట్టు సమాచారం.

దీంతో ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. బీజేపీ శాసన సభాపక్ష నేతను ఎన్నుకోవడంపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. బీజేపీ ఫ్లోర్ లీడర్ రేసులో రాజాసింగ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెంకటరమణరెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. పోటీ తీవ్రంగా ఉండటంతో బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎవర్ని నియమించాలనేది ఇప్పుడు ఆ పార్టీ నాయకత్వానికి సవాల్‌గా మారింది. గత శాసన సభలోనూ రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, రాజాసింగ్‌లలో ఎవర్ని నియమించాలనే విషయం ఎటూ తేల్చకపోవడంతో శాసనసభాపక్ష నేత లేకుండానే కాలం వెళ్లబుచ్చిన విషయమూ తెలిసిందే.

## సంపాదకీయం

### ఆందోళన కల్గిస్తున్న

# హార్ట్ స్ట్రోక్ మరణాలు



దేశంలో గుండెపోటు మరణాలు పెరిగాయి. 2021తో పోలిస్తే 2022లో హార్ట్ స్ట్రోక్ మరణాలు 12.5వాతం పెరిగినట్లు ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడించింది. ఈ కాలంలో 56,653 మంది ఆకస్మిక మరణాలు సంభవించినట్లు పేర్కొంది.గత ఏడాది కాలంలో ఆకస్మిక మరణాల కేసులు గణనీయంగా పెరిగాయి. పలువురు జిమ్‌లో వర్కవుట్ చేస్తుండగా.. ఒకరు డ్యాన్స్ చేస్తూ కిందపడి ఎంతో మరణించారు. ఈ విధంగా, ఆకస్మిక మరణాలకు సంబంధించి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో యొక్క షాకింగ్ గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. ఎన్‌సిఆర్‌బి ప్రకారం, 2022 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 56 వేల 653 మంది ఆకస్మికంగా మరణించారు. ఇది గతేడాది కంటే దాదాపు 12% ఎక్కువ. వీరిలో 57% మరణాలు గుండెపోటు కారణంగా సంభవించాయని పేర్కొంది. ఔఅఖీః నివేదిక రాష్ట్ర పోలీసు విభాగాలు అందించిన డేటా ఆధారంగా రూపొందించింది. 'ఆకస్మిక మరణాలు' తక్షణం లేదా గుండెపోటు, మెదడు రక్తస్రావం కారణంగా సంభవించే ఊహించని మరణాలుగా నిర్వచించింది. కొన్ని కారణాల వల్ల ఇది జరుగుతుంది. గత నెలలో ఒక వైద్య అధ్యయనం ఆకస్మిక మరణానికి, కోవిడ్ –19 టీకాకు మధ్య ఎటువంటి సంబంధాన్ని తిరస్కరించడం గమనార్హం.2022లో జరిగిన మొత్తం ప్రమాద మరణాలలో (ప్రకృతి వైపరీత్యాలు కాకుండా) ఆకస్మిక మరణాల వాటా మొత్తం 3.9 లక్షల మరణాలలో 13.4% అని నివేదిక పేర్కొంది. మరణించిన వారిలో ఎక్కువ మంది పురుషులు ఉన్నారు. వారిలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది 45 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్కులేనని గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది మహారాష్ట్రలో అత్యధికంగా (14,927), కేరళ (6,607), కర్ణాటక (5,848) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ రాష్ట్రాల ర్యాంకింగ్ గత ఏడాది కూడా ఇదే విధంగా ఉంది.2022లో 32,410 మంది గుండెపోటు కారణంగా మరణించారు, ఇది గత సంవత్సరం కంటే 14% ఎక్కువ. మహారాష్ట్రలో అత్యధిక మరణాలు (12,591), కేరళ (3,993), గుజరాత్ (2,853) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఎన్‌సిఆర్‌బి సంకలనం చేసిన డేటా కూడా గుండెపోటుతో మరణించిన వారిలో 28,005 మంది పురుషులు. ఈ బాధితులలో 22,000 మంది 45–60 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఉన్నారు.తీవ్రమైన కరోనాతో బాధపడుతున్న వ్యక్తులు వ్యాయామాలు, వర్కౌట్‌లు చేసేటప్పుడు ఎక్కువ కష్టపడవద్దని, కొంతకాలం పాటు ఎటువంటి శ్రమతో కూడుకున్న పని చేయవద్దని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా ఇటీవల సూచించారు. ఎఅఓఖీ అధ్యయనాన్ని ఉటంకిస్తూ, కోవిడ్ –19 కారణంగా గతంలో ఆసుపత్రిలో చేరడం, ఆకస్మిక మరణాల కుటుంబ చరిత్ర , జీవనశైలిలో మార్పులు యువతలో ఆకస్మిక మరణాల పెరుగుదలలో పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.మన శరీరంలోని అన్ని ఇతర భాగాల్లాగే, గుండె కూడా బాగా పని చేయడానికి ఆక్సిజన్ మంచి సరఫరా అవసరం. హృదయ ధమనులు ఈ అవసరాన్ని పూర్తి చేస్తాయి మరియు గుండెకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తాయి. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు జీవనశైలి కారణంగా, కొరోనరీ ధమనుల గోడలపై కొవ్వు నిల్వలు లేదా ఫలకం అభివృద్ధి చెందుతుంది. ఇటువంటి ఫలకం నిర్మాణం తగిన జీవనశైలి మార్పులు లేకుండా కాలక్రమేణా అడ్డంకులుగా మారుతుంది. ధమనిలో ఏదైనా అడ్డుపడటం వల్ల గుండె కండరాల భాగాలకు రక్తం చేరకుండా చేస్తుంది. ఇది కార్డియాక్ ఇస్కీమియాకు కారణమవుతుంది, ఈ పరిస్థితి గుండెలో కొంత భాగం ఆక్సిజన్‌ను కోల్పోతుంది. కార్డియాక్ ఇస్కీమియాను చాలా కాలం పాటు గుర్తించనప్పుడు లేదా చికిత్స చేయకపోతే, గుండె కణజాలం చనిపోవడం ప్రారంభమవుతుంది మరియు గుండెపోటుకు కారణమవుతుంది. గుండెపోటును మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ అని కూడా అంటారు.గుండెలో కరోనరీ ధమనులు దెబ్బతినడం వల్ల గుండెపోటు వస్తుంది. అనేక కారణాల వల్ల కొరోనరీ ధమనులు నిరోధించబడతాయి మరియు ఇది గుండెలో ఆక్సిజన్ సరఫరా లోపానికి దారితీస్తుంది. ఈ పరిస్థితిని కరోనరీ ఆర్టరీ వ్యాధి అని పిలుస్తారు, ఇది చాలా గుండెపోటులకు ప్రధాన కారణంఇతర సందర్భాల్లో, కొలెస్ట్రాల్ మరియు ఇతర పదార్థాలను రక్తప్రవాహంలోకి అనుమతించడానికి గుండెలో ఏర్పడిన ఫలకం చీలిపోయినప్పుడు గుండెపోటు సంభవిస్తుంది. చీలిక సమయంలో, రక్తం గడ్డకట్టడం వల్ల గుండెకు ఆక్సిజన్‌తో కూడిన రక్త సరఫరాను అడ్డుకుంటుంది. అరుదైన సందర్భాల్లో, రక్తనాళాల దుస్సంకోచం వల్ల గుండెపోటు వస్తుంది

# ప్రొటెం స్పీకర్గా అక్బరుద్దీన్ ప్రమాణ స్వీకారం



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ఎంఐఎంకు చెందిన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రొటెం స్పీకర్గా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్భవన్లో ఉదయం 8.30 గంటలకు గవర్నర్ తమిళిసై.. అక్బరుద్దీన్ తో ప్రమాణం చేయించారు. సాధారణంగా సీనియర్ సభ్యులకు ప్రొటెం స్పీకర్ బాధ్యతలు అప్పగిస్తుంటారు. ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్రెడ్డి ఇతర పార్టీల ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రొటెం స్పీకర్గా అక్బరుద్దీన్ వారితో ప్రమాణం చేయించారు.

# అమరులకు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేల నివాళులు

**అమరులకు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేల నివాళులు**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు శనివారం ఉదయం బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అమరవీరులకు నివాళు లర్పించారు. హైదరాబాద్‌లో అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కు వద్ద అమరవీరుల స్థూపానికి ముందుగా బీజేపీ ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. ఆ పార్టీ నుంచి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలవగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తప్ప మిగిలిన ఎమ్మెల్యేలు అమరులను గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, లాస్య నందిత సాయన్న తదితర ఎమ్మెల్యేలు అమరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



వివేక్ తో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామ్యేల్ తదితరులు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

# అప్పు తీర్చలేదని దంపతుల దారుణ హత్య

- అప్పు తీర్చలేదని దంపతుల దారుణ హత్య
- ముందు భర్తను హతమార్చి పాతిపెట్టిన వైనం
- విషయం బయటికి రాకుండా భార్యను సైతం హత్య

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



అప్పు తీర్చడం లేదని కక్షతో దంపతులను గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, స్థానికు లు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌లోని సత్యకాలనీ పయోనీర్ ఎన్‌క్లేవ్‌లో సయ్యద్ అహ్మద్ ఖాద్రీ(42), సయిాదా మిరాజ్ ఫాతిమా(40) నివాసం ఉంటున్నారు. వీరికి 2014లో వివాహం అయింది. సయ్యద్ అహ్మద్ ఖాద్రీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మేకల వ్యాపారం కోసం ముంబయికి చెందిన వ్యాపారుల నుంచి రూ. 20 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే మూడేండ్లుగా వారికి అప్పు తిరిగి చెల్లించలేదు. దాంతో ఈ నెల 2న ముంబయి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి టోలిచౌకీలో ఆశ్రయం పొందారు. 3వ తేదీన ఖాద్రిని కిడ్నాప్ చేసి ఓ చెరువు వద్ద హత్య చేసి అక్కడే పాతిపెట్టారు. ఫాతిమా ద్వారా ఈ విషయం బయటపడుతుందని భావించిన ముగ్గురు వ్యాపారులు మరుసటి రోజు ఆమె ఇంటికి వెళ్లి ఫాతిమాకి ఊరివేసి చంపారు. ఎవరికి అనుమానం రాకుండా గ్యాస్ లీక్ చేసి బయటి నుంచి తాళం వేసి వెళ్లిపోయారు.

నాలుగు రోజుల క్రితం ఫాతిమాకు తన సోదరి సైయెదా మెహర్ ఫాతిమా ఎన్ని సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దాంతో ఆమె నేరుగా ఇంటికి వచ్చి చూడగా ఇంటి నుంచి గ్యాస్ వాసన వచ్చింది. దాంతో ఆమె తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫాతిమా ఉరివేసుకుని కనిపించింది. పిల్లలు పుట్టకపోవడంతో ఫాతిమాను ఆమె భర్త ఖాద్రి చంపి పారిపోయాడని అనుమానించి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దంపతుల ఇంటి పరిసర ప్రాంతాల్లో, సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఇంటి లోపల నుంచి ముగ్గురు వ్యక్తులు బయటికి వస్తున్నట్టుగా కనిపించిన దృశ్యాలను పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత వారిని గుర్తించి శు క్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఏ1 అజ్గర్ షేక్ అలియాస్ అన్వర్ అన్ను, ఏ2 మహమ్మద్ హుస్సేన్ అలియాస్ సమీర్, ఏ3 మోహిత్ సల్మాన్ అలియాస్ అద్దులపై సెక్షన్ 302, 120 బి,379, అలాగే 498ఏ,201 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రజలు తనకు ఈ బాధ్యతను అప్పగించారని చెప్పారు. పజలందరి ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యతను తీసుకుంటాననీ, కార్యకర్తలకు కచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రే, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కోదండరెడ్డి, జి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల మనసు దోచిన రాజ్‌ఠాకూర్

**- సింగరేణి కార్మికుని వేషధారణతో అసెంబ్లీకి**

**- భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

సింగరేణి ప్రాంతం నుంచి వచ్చాడు. తొలిసారి గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాడు. తాను సింగరేణి కార్మికుల ప్రతినిధినంటూ కార్మికుల డ్రస్సు వేసుకుని, తట్ట, చెమ్మాస్ చేతిలో పట్టుకుని, లైట్‌తో కూడిన హెల్మెట్ పెట్టుకుని శాసనసభ ఆవరణలోకి శనివారం ఎంట్రీ ఇచ్చాడు. అందరి చూపూ తనవైపు తిప్పుకున్నాడు. అసెంబ్లీ ఆవరణలోకి రాగానే భావోద్వేగానికి లోనయ్యాడు. ఇంతకీ అతనెవరనుకుంటున్నారా? కాంగ్రెస్ నుంచి గెలుపొందిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్. తొలిరోజు తన వేషధారణతో అసెంబ్లీకి వచ్చి సింగరేణి కార్మికుల మనస్సు దోచేశాడు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. '25 ఏండ్ల నా సుదీర్ఘ పోరాటం ఫలించింది. సింగరేణి ప్రాంతం నుంచి కార్మికుల ప్రతినిధిగా అసెంబ్లీకి వచ్చా. వారి గౌరవం కాపాడుతా. గడీల పాలనకు చరమగీతం పాడి నాకు భారీ మెజార్టీ ఇచ్చిన సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలందరికీ ధన్యవాదాలు. సింగరేణి కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపెన్‌కాస్టులు ఇబ్బందికరంగా మారాయి. ఆ ప్రాంతమంతా కాలుష్యమైపోయింది. చుట్టూ నీళ్లున్నా కాలుష్యంతో తాగలేని పరిస్థితి ఉంది. అక్కడి వాతావరణంతో పెరాలసిస్, గుండెజబ్బులు, ఇతరత్ర అనారోగ్య సమస్యలతో ప్రజలు చనిపోతున్నారు.

ఆ ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ పర్యా వరణం పునరుద్ధరించాలంటే




వేల ఎకరాల్లో మొక్కలు నాటాలి. నేడు సింగరేణిలో కార్మికుల సంఖ్య ఏటేటా తగ్గిపోతున్నది.

యువతకు మేలు చేయాలి. సింగరేణి ప్రాంతంలో చేయాల్సిన పనులెన్నో ఉన్నాయి. నాకు సాధ్యమైనంత మేరకు నియోజకవర్గ ప్రజలకు, సింగరేణి కార్మికులకు మేలు జరిగేలా సింగరేణి కార్మికుల ప్రతినిధిగా అసెంబ్లీలో మాట్లాడుతా' అంటూ భావోద్వేగంతో అన్నారు. అసెంబ్లీకి తన కుటుంబంతో కలిసి వచ్చారు.

**ఎస్ఎల్‌బీసీ కాల్వ పొడిగింపు కోసం కృషి చేస్తా :** కె.జయవీర్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ కాలువను మరో తొమ్మిది కిలోమీటర్లు పొడిగించేందుకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ శాసనసభ్యుడు కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా అవకాశమిచ్చిన ఏఐసీసీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తన తాత, తండ్రిని ఆదర్శంగా తీసుకుని నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని హామీనిచ్చారు.

## మంత్రివర్గానికి సీపీఎస్ యూనియన్ శుభాకాంక్షలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నూతన మంత్రివర్గానికి టీఎస్‌సీపీయస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఉన్న సీపీఎస్ యూనియన్ కార్యాలయంలో స్థితప్రజ్ఞ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఉద్యోగులు వారధిగా పని చేస్తారని చెప్పారు. సీపీఎస్ ఉద్యోగుల ఆకాంక్ష పాత పెన్షన్‌ను పునరుద్ధరించడమేనని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో అందుకనుగుణంగా ప్రకటించిందనీ, ఓట్ ఫర్ ఓపీఎస్ ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల్లో రెండు గ్యారంటీలను అమలు చేసి నిబద్ధతను చాటుకున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేసినట్టు అతి త్వరలో తెలంగాణలోనూ ఓపీఎస్‌ను అమలు చేస్తారనే నమ్మకముందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మల్ రెడ్డి రంగారెడ్డి అనే నేను



ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఘనవిజయం సాధించిన మల్ రెడ్డి రంగారెడ్డి శనివారం శాసనసభలో శాసన సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం, ప్రసంగం ఆయన మాటల్లోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజల కోసం ప్రజలతోనే మార్పు వచ్చింది. కాంగ్రెస్ వచ్చింది.

## బిఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమేష్ గౌడ్



**యాచారం - ప్రభాత సూర్యుడు :** ఆదివారం 10:30 గంటలకు బిఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం. బొంగులూరు కళ్యం జంగారెడ్డి గార్డెన్ లో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల అధ్యక్షులు కార్యదర్శులు సర్పంచులు , ఎంపీటీసీలు, జెడ్పీటిసి, పిఎసిస్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, బూత్ కన్వీనర్ లు, బూత్ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని తెలియజేశారు.
ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక తెలంగాణ

## ఆళ్ళపల్లిలో ఘనంగా సోనియాగాంధీ జయంతి వేడుకలు


**ఆళ్ళపల్లి :** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ నోట జన్మదినం రోజే గతంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక తెలంగాణ ప్రకటన వచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని ఆళ్ళపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాయం రామనర్సయ్య చెప్పారు. ఈ మేరకు శనివారం ఆళ్ళపల్లితో పాటు మర్కోడు గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు మరోసారి సోనియమ్మ జన్మదినం రోజే మరోసారి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడం హర్షణీయమన్నారు.

# ఆరుట్లలో సోనియా గాంధీ 77వ జన్మదినం

- కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మాధగోని జంగయ్య గౌడ్
-తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన దేవత సోనియా గాంధీ
-ప్రధానమంత్రి పదవి త్యాగం చేసిన గొప్ప నాయకురాలు

మంచాల - ప్రభాత సూర్యుడు





తెలంగాణ రాష్ట్రంఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కాంగ్రెస్ పార్టీ నాయకుడుకొంగర విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు. ఆరుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల బాషా అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గ్రామ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి మంచాల మండలం సహకార బ్యాంక్ డైరక్టర్ వేదిరే హన్ మంత్ రెడ్డి ,మాధగోని జంగయ్య మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ ప్రధాన మంత్రి అయ్యే అవకాశం వచ్చిన సీనియర్ నాయకుల కోసం ప్రధాన మంత్రి పదవి త్యాగం చేసిన గొప్ప నాయకురాలు సోనియా గాంధీ అన్నారు .తెలంగాణ రాష్ట్ర ప్రజలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలి అని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్న సమయంలో 12 వందల మంది ఉద్యమ కారులు ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయారు. అది చూసిన సోనియా గాంధీ చలించి పోయి ఎలాగైనా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలి అని పార్టీ పెద్దల తో చర్చించి తెలంగాణ రాష్ట్రం ప్రకటన చేసిన గొప్ప నాయకురాలు తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన దేవత సోనియా గాంధీ అన్నారు .మా ప్రాణం ఉన్నంత వరకు సోనియా గాంధీ కుటుంబం కోసం కాంగ్రెస్ పార్టీ లో పని చేస్తాం. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకుంటాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుంకరి పాండు గౌడ్, మంచాల మండలం కిషన్ సెల్ మండలం అధ్యక్షుడు, అనంగల యాదయ్య, కావాలి బుగ్గ రాములు ముదిరాజ్, యంపి టీసి. కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, పంబల. బుగ్గ రాములు, ముచ్చర్ల. వెంకటేష్ యాదవ్ , గుడ్డి మల్ల చెంద్రయ్య ముదిరాజ్ మాదగోని జంగయ్య గౌడ్, చెరుకు నర్సిహ్మా గౌడ్, అంతటి రాజు గౌడ్, సాతిరి, ఎల్లేష్ చిందలయ్య, మెగవత్ లక్ష్మ నాయక్ , మర సురేష్ , వస్పరి కుమార్, సుంకరి ప్రవీణ్ గౌడ్ , లచ్చాగారి జంగా రెడ్డి, కొళ్లోజు సత్యం చారి, రావుల రాఘవ, యండి. అశ్రప్ , వెదిరే సికిందర్ రెడ్డి , దాసరమోని అశోక్ ముదిరాజ్, బుడిగల పరమేష్ , కొండూరి లింగం మెగవత్. అర్జున్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎల్పీ నేతగా కేసీఆర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలందరూ ఆయన్ను ఏకగ్రీవంగా తమ నేతగా ఎన్నుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు అధ్యక్షతన శాసనసభాపక్ష సమావేశాన్ని నిర్వహించారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఎల్పీ లీడర్‌గా కేసీఆర్ పేరును ప్రతిపాదించగా, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాసయాదవ్ బలపరిచారు. మిగతా కమిటీని ఎంపిక చేసే బాధ్యతను కేసీఆర్‌కు అప్పగిస్తూ శాసనసభాపక్షం ఏకగీవ్రంగా తీర్మానించింది.

## ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర ప్రజలు పదేండ్లుగా ఉక్కిరి బిక్కిరయ్యారనీ, ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డితో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించారన్నారు. ఒక్కరైనా కమ్యూనిస్టు నేత అసెంబ్లీలో ఉండాలనీ, ఉంటే పేద వర్గాలకు కొండంత అండ ఉంటుందని తనకు అవకాశమిచ్చా రన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడు తానని తెలిపారు. పేద వర్గాల సమస్యలు ప్రభుత్వం ముందుంచే బాధ్యత తనపై ఉందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలు పరి ష్కారం కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సహ కారంతో గెలిచినప్ప టికీ ప్రజా సమ స్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లడం తన బాధ్యతని చెప్పారు. ఉపా లాంటి చట్టాలు పోవాలని ఆకాంక్షిం చారు. ధరణి అనేక సమస్యలున్నాయనీ, వాటి పరి ష్కారం కోసం కృషి జరగాలని అన్నారు.

## శ్రీనగర్‌లో రెచ్చిపోయిన ఉగ్రవాదులు..



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** శ్రీనగర్‌లో శనివారం ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. బెమినాలోని హమ్దానియా కాలనీలో ఓ పోలీస్‌పై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. గాయపడిన పోలీస్‌ను మహ్మద్ హఫీజ్‌గా గుర్తించారు. కాల్పుల్లో గాయపడ్డ ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత సమాచారం అందుకున్న భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఉగ్రవాదుల కోసం సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. మహ్మద్ హఫీజ్ పొట్టపై, చేతికి గాయాలయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే, ఒక్కసారిగా కాల్పులు జరుగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో స్వల్ప తొక్కిసలాట చోటు చేసుకుంది. ఎవరికి వారు భయంతో పరుగులు తీస్తూ తమను తాము రక్షించుకునేందుకు పరుగులు పెట్టారు. కాల్పులు జరిపిన అనంతరం ఉగ్రవాదులు సంఘటనా స్థలం నుంచి పరారయ్యారు. ఆ తర్వాత స్థానికులకు పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే, ఇటీవల శ్రీనగర్‌లో ఈద్గా ప్రాంతంలో క్రికెట్ ఆడుతున్న ఇన్‌స్పెక్టర్‌పై సైతం ఉగ్రవాదులు బుల్లెట్ల వర్షం కురిపించారు. గాయపడ్డ మస్రూర్ అహ్మద్ 39 రోజుల తర్వాత చికిత్స పొందుతూ డిసెంబర్ 7న ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలను కోల్పోయారు. ఉగ్రవాదులు అతి సమీపం నుంచి ఇన్‌స్పెక్టర్‌ను లక్ష్యంగా చేసుకుని మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215